క్లుప్తంగా

వైభవంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న సాందీప్‌శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణ ఉత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. నిజ శ్రావణ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను కల్యాణ మూర్తులుగా అలంకరించి అనివేటి మండపంలో వేంచేసింపజేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు సాందీప్‌శర్మ కల్యాణాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు ద్వారపు అనూరాధ, అజిత్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీరు వృథా



ట్యాప్ లేక వృథాగా పోతున్న నీరు

లావేరు: కేశవరాయునిపురం గ్రామంలో మంచినీటి కుళాయిల ట్యాప్‌లు పాడయ్యాయి. దీంతో మంచినీరు వృథాగా బయటకు పోతుందని గ్రామస్తులు తెలిపారు. సుమారు నెల రోజులుగా ఈ పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. పంచాయతీ పెద్దలు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

మొక్కలు బహూకరణ



పూలమొక్కలను అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. బోయపాలెం గ్రామంలో ఓ బారసాల వేడుకలో బంధువులకు కానుకలు బదులు పూల మొక్కలను ఆదివారం బహూకరించారు.

కష్టపడేవారికి గుర్తింపు



కిరణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సింక గౌరీ

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడేవారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కమ్మసిగడాం పంచాయతీకి చెందిన సింక గౌరీని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఇటీవల నియమించారు. ఈ నేపథ్యంలో ఆమె ఎమ్మెల్యేను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ నాయకులు సింక సూర్యరాము, లోచర్ల క్రిష్ణ, బవిరి రామకృష్ణ, వడ్డి నాగరాజు ఉన్నారు.

సీఐగా కామేశ్వరరావు



గార: గార పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా పనిచేసిన ఎస్.కామేశ్వరరావును ఉద్యోగోన్నతిపై శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐగా నియామకం చేస్తూ విశాఖపట్నం డీఐజీ కార్యాలయం ఆదివారం ఉత్తర్వులను జారీ చేసింది. ఐదు రోజుల క్రితం ఉద్యోగోన్నతి సాధించిన కామేశ్వరరావును గార పోలీస్ స్టేషన్‌లో కొనసాగాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

మేమున్నామని..



ఆర్థికసాయం అందజేస్తున్న తోటి స్నేహితులు

గార: తమతోపాటు కలిసి చదువుకున్న తోటి విద్యార్థి ప్రమాదంలో గాయపడటంతో గార జెడ్పీ హైస్కూల్‌లో 1997–98లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు చేయూతనందించారు. కుమ్మరిపేట గ్రామానికి చెందిన ముద్దపు నాగభూషణం ఏలూరులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు రూ.34,500 పోగుచేశారు. ఆదివారం కుమ్మరిపేట వెళ్లి ఈ మొత్తం అందజేశారు.

వంతెన నిర్మించాలి

టెక్కలి: మేఘవరం పంచాయతీ పరిధి మేలిసతివాడ–రావిపాడు గ్రామాలను కలుపుతూ ఉన్నటువంటి గెడ్డ వద్ద వంతెన నిర్మాణం చేయాలని బీజేపీ నాయకులు పరమేశ్వరరావు, లింగరాజు, కామరాజు కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



లావేరు: పుస్తక పఠనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

లావేరు: పుస్తక పఠనంతో జ్ఞానం లభిస్తుందని లావేరు శాఖాగ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు తదితర పుస్తకాలు చదవడంపై ఆదివారం పోటీలు నిర్వహించారు. బాగా చదివిన ముగ్గురికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించే ఇతర పుస్తకాలను కూడా చదవాలని సూచించారు. గ్రంథాలయాల్లో ఉండే పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ నీలమ్మ విద్యార్థులకు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల వివరాలు తెలియజేశారు. సెలవు రోజులు, పాఠశాల క్లాస్ వర్కు తరువాత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కథల పుస్తకాలు, వార్తా పత్రికలు, పోటీ పరీక్షల మెటీరియల్ అందుబాటులో ఉన్నాయన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

రణస్థలం: గ్రంథాలయాల్లో ఉండే పోటీ పరీక్షల మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రణస్థలం శాఖా గ్రంథాలయ అధికారిణి పి.వరలక్ష్మి అన్నారు. గ్రంథాలయంలో చదవడం మా కిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతొందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను ప్రదర్శించారు. అలాగే వ్యాసరచన, క్విజ్ పోటీలను విద్యార్థులకు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బలగలో..

శ్రీకాకుళం అర్బన్: కథలు చదవడం, చెప్పడం, పద్యాలు నేర్చుకోవటం వల్ల విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని బలగ గ్రంథాలయశాఖ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. నగరంలోని బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం–మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు కథలు చెప్పారు. ఈ సందర్భంగా ఉగ్రసేన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనకు దగ్గరలో ఉన్న గ్రంథాలయానికి వెళ్లి కథలు, పద్యాలు, పొడుపు కథల పుస్తకాలు చదివి వాటిపై అవగాహన కల్పించుకోవాలన్నారు. తద్వారా తెలుగు భాషపై పట్టు సంపాదించవచ్చన్నారు. ఆదివారాలు, సెలవు రోజుల్లో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి చిన్న, చిన్న కథలు చదివి కొత్తవారికి చెప్పి వారికి మీరు స్ఫూర్తిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: పుస్తక పఠనంలో విద్యార్థులు



రణస్థలం: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



శ్రీకాకుళం అర్బన్: చదవడం-మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

సాయి డెంటల్ కళాశాలలో..

ఆర్థోడాంటిక్స్ విభాగం ప్రారంభం



కళాశాల బ్రోచెర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పాత్రునివలస జాతీయ రహదారిలో గల శ్రీసాయి డెంటల్ రిసెర్చ్ కళాశాలలో ఆర్థోడాంటిక్స్ విభాగాన్ని ఆదివారం ప్రారంభించారు. ఎత్తు పళ్లు, వంకర పళ్లను సరిచేసేందుకు క్లిప్లిలిగేస్ పేరుతో క్లియర్ అలైనర్ థెరపీ ద్వారా ఆర్థో డాంటిక్ చికిత్సను చేయనున్నట్లు ఆ విభాగపతి నవ్య తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మూడు జిల్లాల నుంచి 100 మంది డెంటల్ ప్రాక్టీషనర్లను ఉద్దేశించి మాట్లాడారు. ఉత్తర కోస్తా, ఆంధ్రా బెల్ట్‌లో కొత్తగా అభివృద్ధి చేసిన ఈ సాంకేతికతకు సంబంధించి అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేసిన ఏకైక సంస్థ తమదన్నారు. శ్రీసాయి డెంటల్ కాలేజ్‌లోనే మొట్టమొదటి సారిగా ఆర్థో డాంటిక్స్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి డెంటల్ కళాశాల రిసెర్చ్ ఇనిస్ట్యూట్ డైరెక్టర్ డాక్టర్ టి.బి.వి.జి.రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పలువురు వక్తలు ఉద్బోధించారు. పట్టణంలోని కత్తెర వీధిలో గల అవతార్ మెహెర్‌బాబా కేంద్రం 62వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. పలు మెహెర్ కేంద్రాలకు చెందిన భక్తులు సంకీర్తనలు ఆలపించారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. మచిలీపట్నంకు చెందిన మెహెర్ సుధాకర్, హైదరాబాద్‌కు చెందిన మెహెర్ వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు పి.వి.రంగప్రసాదరావు, ఆనంద్‌కుమార్, వి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో పశువైద్య శిబిరం



పశువుకు వైద్యం చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: ఆనందపురం ఆర్‌బీకే పరిధిలో ఆదివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశువైద్య సిబ్బంది బాలి లక్ష్మంనాయుడు, వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి అధికారి ముంతా హేమంత్ సమక్షంలో పశువులకు వైద్య పరీక్షలు చేశారు. గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్‌బీకేకి చేరిన ఎరువులు



గేదెలపేటకు చేరిన ఎరువులు

జి.సిగడాం: సీతంపేట, పెంట, గేదెలపేట రైతు భరోసా కేంద్రాలకు యూరియా, ఇతర ఎరువులు ఆదివారం చేరాయి. వీటిని రైతులు సద్వినియోగించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు.

ఆక్రమణదారునికి నోటీసులు



పాతపట్నంలో నిబంధనలు అతిక్రమించి చేపట్టిన భవన నిర్మాణం

ఎల్.ఎన్.పేట (పాతపట్నం): పాతపట్నం మేజర్ పంచాయతీ అంతరాబ (అచ్యుతాపురం) గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 13/6, 3/1లో అక్రమ భవన నిర్మాణంతోపాటు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించినందున నోటీసులు జారీ చేసినట్లు ఈఓటి.కూర్మారావు ఆదివారం ప్రకటించారు. భవన నిర్మాణ అనుమతులను 2019 జనవరిలో బిల్డర్ పొందారన్నారు. అక్రమ నిర్మాణంతోపాటు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి నిర్మాణ పనులు చేస్తున్నందున సంజాయిషీ కోరుతూ ఈ ఏడాది జూన్ 30వ తేదీన నోటీసులు జారీ చేశామన్నారు. బిల్డర్ ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేనందున నోటీసులు జారీ చేశామన్నారు. అనుమతి కోరిన కంటే అదనంగా స్థలాలను అక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించామన్నారు. ఇచ్చిన అనుమతి కంటే పక్క స్థలాల్లో నిర్మాణం చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారని తెలిపారు. భవన నిర్మాణ ప్లాన్‌లో చూపిన విధంగా కాకుండా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్లాన్‌లో చూపిన విధంగా గ్రౌండ్ ఫ్లోర్, రెండో ఫ్లోర్ నిర్మాణం చేయలేదన్నారు. చట్ట విరుద్ధంగా క్రయవిక్రయాలు జరిపారని వివరించారు. తూర్పు వైపున ఉన్న చెరువు గట్టుపై నడకతోవ సుమారు 341.89 చదరపు మీటర్లు అక్రమించి ప్రహరీ, అక్రమ భవన నిర్మాణం చేశారన్నారు. అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకున్న స్థలం కంటే అదనపు స్థలం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆక్రమణలు సొంత ఖర్చులతో తొలగించాలని సదరు బిల్డర్‌ను కోరామన్నారు. అక్రమ నిర్మాణాలు తొలగించకపోతే పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో పంచాయతీ అధికారులే తొలగించి, ఖర్చులు బిల్డర్ వద్ద నుంచి వసూలు చేయటం జరుగుతుందన్నారు.

సత్యసాయి సేవలు విస్తృతం చేయాలి



ఆహ్వానిస్తున్న జిల్లా సేవాదళ్ సమన్వయకర్త రామచంద్రరావు

హిరమండలం: సత్యసాయి సేవలు మరింత విస్తృతం చేయాలని సత్యసాయి సేవా సంస్థల సేవాదళ్ సమన్వయకర్త ఎస్.రామచంద్రరావు, మహిళా సమన్వయకర్త అమ్మన్నమ్మ అన్నారు. స్థానిక ప్రేమ సాయి వృద్ధాశ్రమాన్ని ఆదివారం సందర్శించారు. సెప్టెంబర్ మూడో తేదీన శ్రీకాకుళం మున్సబ్‌పేట గాయత్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా సత్యసాయి సేవాదళ్ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి సభ్యులకు ఆహ్వానిస్తూ ఆహ్వానపత్రికలను అందజేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు, భజన మండలి సభ్యులు హాజరుకావాలని కోరారు. బాబా వందో జయంతి నాటికి జిల్లాలో మరింతగా సేవలు విస్తృతం చేయాలని కోరారు. ప్రేమతో సేవ చేయడం ద్వారా భగవంతుని ఆశీస్సులు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ పప్పల అప్పలనాయుడు, సమితి కన్వీనర్ వెంకటరావు, ఆశ్రమ కో ఆర్డినేటర్ ఎ.సాయిబాబా, సభ్యులు చంటి మాస్టర్, కె.జయరాం, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణ బుట్టల పంపిణీ

ఎల్.ఎన్.పేట: మండలంలోని దబ్బపాడు గ్రామంలో ఇంటింటికీ చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేశామని సర్పంచ్ ముద్దాడ మోహని ఆదివారం తెలిపారు. ఇంటిలో తడి, పొడి చెత్తను వేరువేరుగా బుట్టల్లో వేసి పారిశుద్ధ్య కార్మికులు వచ్చినప్పుడు అందజేయాలన్నారు. ఇంట్లోని చెత్తను తీసుకుని వచ్చి వీధుల్లో పడేయకూడదని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్దాడ లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు రావాడ సరోజిని, ఫీల్డ్ అసిస్టెంట్ రావాడ మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వెన్నెలవలస గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

సరుబుజ్జిలి: పులి సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అటవీ సెక్షన్ అధికారి ధర్మారావు తెలిపారు. వెన్నెలవలస, బసిమానిగూడ, బొడ్లపాడు గ్రామాల్లో ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. బయటకు వెళ్లే సమయంలో ఎటువంటి ఆయుధాలు లేకుండా ఒంటరిగా ప్రయాణాలు చేయవద్దని తెలిపారు. ప్రజలంతా గుంపులుగా మాత్రమే వెళ్లాలని సూచించారు. పోడు వ్యవసాయం కోసం వెళ్లే గిరిపుత్రులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బీట్ ఆఫీసర్ జకీర్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి ప్రాధాన్యం

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం అభివృద్ధికి నిరంతరం ప్రాధాన్యమిస్తున్నామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన శనివారం కత్తెరవీధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రులుగా పనిచేసిన అచ్చెన్నాయుడు, నారాయణ అనేకసార్లు మార్కెట్‌ని సందర్శించినా ప్రతిసారి మేదర వీధిలో రోడ్డుకి ఇరువైపులా ఉండే బుట్టలను తన్నేశారే తప్ప ఏ రోజూ మార్కెట్‌ని అభివృద్ధి పరచలేదన్నారు. కనీసం ఆ ఆలోచన కూడా చేయలేదన్నారు. రూ.500 కోట్లు ఖర్చు చేసి శ్రీకాకుళం పట్టణంలో ఉండే 12 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ మెంటాడ పద్మావతీ, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, కోణార్క్ శ్రీనివాస్, సుంకరి కృష్ణ, ఎన్ని ధనుంజయ్, మండవిల్లి రవి, ప్రకాష్, తెలుగు రమేష్, వానపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

- రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ సుబ్బారావు



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రాంగణంలో 20 మందికి కుట్టు మిషన్లు, ట్రైనింగ్ పొందిన 70 మంది మహిళలకు శనివారం రాత్రి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు యెరుకోల మురళీమోహనరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గవర్నర్ సుబ్బారావు మాట్లాడారు. రోటరీ క్లబ్ ద్వారా పోలియో నిర్మూలన కోసం వేలాది కోట్ల రూపాయలను అందజేసినట్లు పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడు యెరుకోల మురళీమోహన్‌రావు కోరిక మేరకు ప్రసిద్ధ దేవాలయాలైన శ్రీకూర్మం, అరసవల్లి దేవస్థానాల్లో శాశ్వత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదిస్తున్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది యెరుకోల మురళీమోహన్‌రావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థ రోటరీక్లబ్ అని తెలిపారు. ఈ సంస్థ ప్రజలకు అనేక సేవా, సామాజిక కార్యక్రమాలు, శాశ్వత ప్రాజెక్టులు చేపడుతుందన్నారు. తాను అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత నెల రోజుల్లోనే శ్రీకాకుళం నగరంలో గల ఏఎస్ఎన్ కాలనీలో పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ 500 మొక్కలు నాటడం జరిగిందన్నారు. విశాఖ–బి కాలనీలో గల షిర్డీ సాయిబాబా మందిరం వద్ద పిల్లలు, మహిళల ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. డిస్ట్రిక్ట్ 3020లో అత్యధికంగా సభ్యులను చేర్పించడంలో కీలకపాత్ర పోషించడం జరిగిందన్నారు. మురళీమోహన్‌రావు, క్లబ్ గవర్నర్ సుబ్బారావు చేతుల మీదుగా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, వరదా కొండబాబు, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కె.టి.నాయుడు, కె.నాగేశ్వరరావు, సెక్రటరీ దుర్గారావు, తమ్మినేని వాసుదేవరావు, సభ్యులు పాల్గొన్నారు

రోగులకు పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మదర్ థెరిసా జన్మదినోత్సవంలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ పలాస–కాశీబుగ్గ సభ్యులు ఆదివారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు ఆర్.హేమాచలం, కార్యదర్శి టి.మాధవరావు, కోశాధికారి ఎస్.అప్పారావు, ఎస్ఆర్‌ఎ కణితి హేమాచలం, కేపీ రామన్న, సిందిరి మధుసూదనరావు, ఎల్.కొండలరావు, బమ్మిడి నాగేశ్వరరావు, ఉమాశంకర్ పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం



భగద్గీత శ్లోకాలను పఠిస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ హరేరామ మందిరంలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు భగద్గీత శ్లోక కంఠస్థ తరగతులను ఆదివారం నిర్వహించారు. పరాత్మానంద సరస్వతి స్వామీజీ భగద్గీతలోని నాల్గో అధ్యాయంలో గల జ్ఞాన కర్మ, సన్యాసయోగంలోని శ్లోకాలను చిన్నారులతో పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పారాయణం ద్వారా మనిషి ఎలా జీవించాలో తెలుస్తుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్మయ మిషన్ ప్రతినిధి కె.వెంకటేశ్వరులు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో పర్యాటకులు సముద్ర స్నానాలకు దిగి మృత్యువాత పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు తీరంలో హెచ్చరిక బోర్డును ఆదివారం ఏర్పాటు చేసి పర్యాటకులను అప్రమత్తం చేసా రు. ఎస్సై మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. సరదా కోసం తీరానికి వచ్చే పర్యాటకులు జా గ్రత్తలు పాటించాలని సూచించారు. మద్యం తాగి సముద్రంలోకి దిగరాదని, లోతట్టు ప్రాంతానికి స్నానాలకు వెళ్లరాదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డొంక విద్యాసాగర్ ఉన్నారు.

సీపీఎం సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: దేశవ్యాప్తంగా ఈ నెల 30 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో జరగనున్న సమరభేరి కార్యక్రమానికి చెందిన వాల్ పోస్టర్లను ఆ పార్టీ నాయకులు ఆదివారం కాశీబుగ్గలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, నాయకులు నెయ్యిల గణపతి, జన్ని భాగ్యలక్ష్మి, ఎన్.ఢిల్లేశ్వరి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

కంచిలి: నువాగడ పంచాయతీ పరిధి దొలాయి సాయి గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన మూడు కుటుంబాలకు స్వచ్ఛంద సంస్థలు సాయం చేసి అండగా నిలిచాయి. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ తరఫున 15 సిమెంటు రేకులు, సీతయ్య ఫౌండేసన్ తరఫున చీరలు, దుప్పట్లు, టవల్స్, లుంగీలను ఆయా సంఘ ప్రతినిధులు ఆదివారం అందజేశారు.